నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, ఆదివారం 28 జూలై 2024 | NIZAMABAD

# ఆలయ కట్టడాలు అద్భుతం..

## హైకోర్టు జడ్జి సుజయ్‌పాల్

కామారెడ్డి/భిక్కనూర్, జూలై 27 : భిక్కనూరు, జూలై 27 : సిద్ధరామేశ్వర ఆలయంలో రాతి కట్టడం అద్భుతంగా ఉన్నదని రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, హైకోర్టు జడ్జి సుజయ్ పాల్ ప్రశంసించారు. కామారెడ్డిలోని ఎస్పీ కార్యాలయంలో శనివారం కమ్యూనిటీ మీడియేషన్ వలంటీర్లకు నిర్వహించిన అవగాహన సదస్సులో జడ్జి పాల్గొన్నారు. తన పర్యటనలో భాగంగా భిక్కనూరు సిద్ధరామేశ్వర ఆలయ సమీపంలోని కోనేరును హైకోర్టు జడ్జి శ్రీనివాస్ రావు, కామారెడ్డి జిల్లా జడ్జి వీఎన్ఎస్ వర ప్రసాద్‌తో కలిసి సందర్శించారు. చారిత్రక కట్టడాలను పరిశీలించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులకు అర్చకులు కోనేరు విశిష్టత, దేవాలయ చరిత్రను వివరించారు. ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ శివ ప్రసాద్, ఈవో శ్రీధర్, సీఐ సంపత్‌కుమార్, ఎస్సై సాయికుమార్ ఉన్నారు.

**తగాదాల పరిష్కారానికి కృషిచేయాలి**

సామాజిక బాధ్యతతో తగాదాల పరిష్కారానికి కృషి చేయాలని రాష్ట్ర హైకోర్టు జడ్జి సుజయ్‌పాల్ అన్నారు. చిన్నచిన్న తగాదాలతో పోలీసు స్టేషన్లు, కోర్టుల వరకు వెళ్లి సమయం, డబ్బు, వృథా చేసుకుంటున్నారని, ఇరువర్గాలను సముదాయించి సమస్యను పరిష్కరిస్తే న్యాయంతోపాటు స్నేహపూర్వక సమాజం నిర్మితమవుతుందన్నారు. హైకోర్టు న్యాయమూర్తి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ సామాజిక కార్యకర్తలు, పెద్దమనుషుల సమక్షంలో తగాదాలను పరిష్కరించడానికి కమ్యూనిటీ మీడియేషన్ వలంటీర్లు పని చేయాలన్నారు. కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ మాట్లాడుతూ రాజీమార్గం ద్వారా సమస్యలను పరిష్కరించడంతో సమాజంలో మంచి వాతావరణం ఏర్పడుతుందని, అందుకోసం వలంటీర్లు కృషి చేయాలని సూచించారు. ఎస్పీ సింధూశర్మ మాట్లాడుతూ వలంటీర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికావొద్దని సూచించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ మెంబర్ సెక్రటరీ పంచాక్షరీ, కామారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి వరప్రసాద్, అడిషనల్ జిల్లా న్యాయమూర్తి లాల్ సింగ్ శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్

అన్నదాతలకు తిప్పలు

# రుణమాఫీ గందరగోళం

- అధికారుల చుట్టూ తిరుగుతున్న రైతులు
- రూ.లక్షలోపు రుణాలు మాఫీకాని కర్షకుల పాట్లు



**రైతు రుణమాఫీ** అంతా గందరగోళంగా ఉన్నది. మొదటి విడుత రూ.లక్ష లోపు రుణాలు ఉన్న రైతులందరికీ మాఫీ చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించినా క్షేత్రస్థాయిలో అది కనిపించడం లేదు. రూ.లక్షలోపు రుణం ఉన్నా మాఫీ జాబితాలో పేర్లు కనిపించకపోవడంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొన్నది. దాదాపు పది రోజుల నుంచి బ్యాంకులు, వ్యవసాయ కార్యాలయాల చుట్టూ రైతులు కాళ్లరిగేలా తిరగాల్సిన పరిస్థితి వచ్చింది. కొన్ని చోట్ల సాంకేతిక కారణాలను బూచీగా చూపెడుతున్న అధికారులు మరికొన్ని చోట్ల సరైన సమాధానం చెప్పకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అన్నీ సక్రమంగా ఉన్నా తమకెందుకు రుణమాఫీ కాలేదంటూ ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇంకెన్నడు మాఫీ అవుతుందంటూ రందిపడుతున్నారు.

– కోటగిరి, జూలై 27

### ఎందుకు మాఫీ కాలేదో అర్థమైతలేదు..



మాది కోటగిరి. నా పేరు బేగరి గంగామణి. నాకు ఎక్లాస్‌పూర్ శివారులో ఎకరం భూమి ఉన్నది. గతేడాది కోటగిరి ఎస్‌బీఐలో రూ.70 వేలు క్రాప్‌లోన్ తీసుకున్న. మొదటి విడత రూ.లక్ష లోపు రుణం కాంగ్రెస్ సర్కారు మాఫీ చేసిందని తెలిసి సంబురపడ్డ. లోన్ మాఫీ అవుతుందని బ్యాంకుకు పోయిన. నాలోన్ మాఫీ కాలేదు. రెన్యువల్ కూడా చేయించినా నాకు మాఫీ రాలేదు. వ్యవసాయ శాఖ అధికారులను అడిగితే, మరో జాబితాలో వస్తుందని చెప్పిండ్రు. మొదటి జాబితాలో ఎందుకు మాఫీ కాలేదని అడిగితే సరైన సమాధానం రాలేదు.

**- బేగరి గంగామణి, మహిళారైతు, కోటగిరి**

### ఓపిక పట్టాలంటున్నరు..



నాకు కోటగిరి శివారులో 23 గుంటల భూమి ఉన్నది. గతేడాది కోటగిరి ఎస్‌బీఐలో రూ.32 వేలు క్రాప్‌లోన్ తీసుకున్నా.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు ఎలాగో రూ.లక్షలోపు మాఫీ అన్నరు కాబట్టి నేను తీసుకున్న లోన్ కూడా మాఫీ అవుతుందని సంబురపడ్డా. కానీ జాబితాలో నా పేరు రాలేదని బ్యాంకు అధికారులు అంటున్నారు. నా లోన్ రూ.32వేలు మాత్రమే. వ్యవసాయ, బ్యాంకు అధికారులకు అడిగితే ఇంకా కొన్ని రోజులు ఓపిక పట్టాలని చెబుతున్నారు.

**- సాయిలు, రైతు, కోటగిరి**

### మాఫీ కాలేందటున్నారు..



కోటగిరి, జూలై 27: నాకు ఎక్లాస్‌పూర్ శివారులో ఎకరం భూమి ఉన్నది. కోటగిరి ఎస్‌బీఐలో గతేడాది రూ.75వేల క్రాప్‌లోన్ తీసుకున్నా.. రూ.లక్ష లోపు ఉన్నోళ్లకు ప్రభుత్వం రుణమాఫీ చేసిందన్నారు. కానీ నాకు మాఫీ కాలేదు. బ్యాంకు, వ్యవసాయాధికారులను అడిగితే ఏదేదో చెబుతున్నారు. రుణమాఫీ అంతా గందరగోళంగా ఉన్నది. ఇంకా ఎన్ని రోజులు అధికారుల చుట్టూ తిరగాలో మరి..

**-బేగరి మారుతి, రైతు కోటగిరి**

### సాంకేతిక లోపమా? అధికారుల తప్పిదమా?



ఎడపల్లి, జూలై 27: ఎడపల్లి మండలం మంగళ్‌పాడ్ గ్రామానికి చెందిన పెద్దులు, తన భార్య గంగామణి ఇద్దరూ కలిసి రూ.98వేల క్రాప్‌లోన్ తీసుకున్నారు. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన రూ.లక్ష లోపు రుణమాఫీ జాబితాలో తమ పేరు రాకపోవడంతో కంగుతిన్నాడు. రుణమాఫీ విషయమై వ్యవసాయాధికారులను అడగగా మాఫీ కాలేదని సమాధానమిచ్చారు. తన లోన్ అకౌంట్ నుంచి గట్క చిన్న సాయిలు అనే వ్యక్తి రూ.లక్షా20వేలు రుణం పొందినట్లుగా ఆన్‌లైన్‌లో చూపిస్తున్నట్లు రైతు పెద్దులు తెలిపారు. ఈ విషయమై ఎడపల్లి సొసైటీ కార్యదర్శి రాజారాంను వివరణ అడగగా డీసీసీబీ నిజామాబాద్ బ్రాంచీలో కొన్ని సాంకేతిక కారణాలతోనే అలా చూపించిందని తెలిపారు. నాలుగు రోజుల్లో సమస్యను పరిష్కరించి రుణమాఫీ చేస్తామని పేర్కొన్నారు.

## ఒకే విద్యార్థి.. ఒకే ఉపాధ్యాయుడు



**ఈ చిత్రంలో కనిపిస్తున్నది** కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలంలోని పీర్‌మాయికుంట(తండా)లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల. ఈ బడిలో ఒక్క విద్యార్థి.. ఒకే ఉపాధ్యాయుడు ఉండడం విశేషం. గత ప్రభుత్వ హయాంలో 13 మంది విద్యార్థులుండగా, ప్రస్తుతం సరైన మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ఒకే ఒక్క విద్యార్థి మిగిలాడు. అతనికి ఉపాధ్యాయుడు ఒక్కడే బోధిస్తున్నాడు. శనివారం నమస్తే తెలంగాణ పాఠశాలను సందర్శించగా ఉపాధ్యాయుడు ఒక్కడే విద్యార్థి రాక కోసం ఎదురుచూస్తూ కనిపించాడు. ఆ విద్యార్థికి జ్వరం రావడంతో పాఠశాలకు రాలేదు. అధికారులు ఇప్పటికైనా స్పందించి మౌలిక సదుపాయాలు కల్పించాలని తండావాసులు కోరుతున్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

# దారుణం

- దహన సంస్కారాలు అడ్డుకున్న వైనం
- గ్రామంపై ఓ సామాజికవర్గ పెత్తనం
- ఆధునిక కాలంలోనూ తగ్గని ఆధిపత్యం
- సర్కారు వైకుంఠధామాన్ని చెరబట్టిన సదరు వర్గం

బోధన్ రూరల్, జూలై 27: ఆధునిక కాలంలోనూ కొన్ని వర్గాల ఆధిపత్యం పోలేదు. గ్రామాల్లో ఏండ్లకెండ్లుగా కొనసాగుతున్న వారి పెత్తనం ఇప్పటికీ తగ్గలేదు. నిజామాబాద్ జిల్లా బోధన్ మండలంలోని ఓ గ్రామంలో శనివారం చోటు చేసుకున్న దారుణ ఘటన ఇందుకు నిదర్శనంగా నిలిచింది. స్థానిక వైకుంఠధామాన్ని చెరబట్టిన ఓ సామాజిక వర్గం వారు.. మరో వర్గానికి చెందిన మహిళ అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తుండగా అడ్డుకున్నారు. అప్పటికే పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులు చేసేది లేక మరోచోటికి తీసుకెళ్లి దహన సంస్కారాలు నిర్వహించుకోవాల్సి వచ్చింది. అసలేం జరిగిందంటే.. మండలంలోని ఓ గ్రామంలో మహిళ శనివారం మృతి చెందింది. దీంతో స్థానికంగా ప్రభుత్వం నిర్మించిన వైకుంఠధామంలో దహనసంస్కారాలకు ఏర్పాట్లు ప్రారంభించారు. కట్టెలతో చితి పేర్చుతుండగా, కొన్నేండ్లుగా గ్రామంలో ఆధిపత్యం ప్రదర్శిస్తున్న ఓ సామాజికవర్గం వారు అడ్డుకున్నారు. ఇక్కడ తమ వర్గానికి చెందిన వారి అంత్యక్రియలు మాత్రమే నిర్వహిస్తామని, మీరు ఎందుకు వచ్చారని ప్రశ్నించారు. వైకుంఠధామంలో మిగతా వర్గాల వారు దహన సంస్కారాలు నిర్వహించొద్దని హుకూం జారీ చేశారు. అప్పటికే బాధలో ఉన్న కుటుంబ సభ్యులు, బంధువులు చేసేదేమీ లేక వెనుదిరిగారు. మరోచోట చితిపేర్చి మహిళ అంత్యక్రియలు పూర్తి చేశారు. అయితే, దహన సంస్కారాలను అడ్డుకున్న సదరు సామాజిక వర్గం తీరుపై మండలంలో రోజంతా చర్చ జరిగింది. సమాజంలో అందరూ సమానమే అయినప్పటికీ, ఇంకా గ్రామాల్లో ఓ వర్గం పెత్తనం కొనసాగుతుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజలందరికీ ప్రయోజనం చేకూరేలా కేసీఆర్ ప్రభుత్వం వైకుంఠధామాన్ని నిర్మిస్తే ఓ వర్గం వారు పెత్తనం చెలాయించడంపై గ్రామస్తులు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ప్రాజెక్టుల్లోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

మోర్తాడ్/నిజాంసాగర్/నాగిరెడ్డిపేట, జూలై 27: ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టుల్లోకి ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. ఎస్సారెస్పీలోకి శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు 35,078 క్యూసెక్కుల వరద వచ్చి చేరింది. దీంతో ప్రాజెక్టులో నీటి నిల్వలు 31.035టీఎంసీలకు చేరుకున్నాయి. నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 920 క్యూసెక్కుల వరద వస్తున్నది. ప్రాజెక్టులో నీటి నిల్వ 3.634 టీఎంసీలకు చేరుకున్నది. పోచారం ప్రాజెక్టులోకి 676క్యూసెక్కుల వరద వస్తుండగా.. 9.9ఫీట్ల నీటి మట్టం ఉన్నది.

సండే స్పెషల్

# ఊరంతా పండుగ నేడే..


ఉత్సవాలకు ముస్తాబైన గద్దె

- సంప్రదాయ వేదిక.. సంస్కృతికి ప్రతీక
- ప్రత్యేకం సరి.. బోనాలు

**కులాల ఐక్యత..** సంస్కృతి సంప్రదాయాలకు ప్రతిబింబం ఇందూరు ఊరపండుగ. పాడి పంటలు, ప్రజలు సుఖశాంతులతో ఉండేలా దీవించాలని వేడుకుంటూ ఏటా ఆషాఢమాసంలో నిర్వహించే ఊర పండుగను నేడు(ఆదివారం) ఘనంగా జరుపుకోనున్నారు. 12చోట్ల కొలువై ఉన్న గ్రామ దేవతల ఆలయ ప్రాంగణాల్లో అత్యంత శ్రద్ధా భక్తులతో పూజలు, ఊరేగింపులు పెద్ద ఎత్తున నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది..

– సుభాష్‌నగర్, జూలై 27

### ఖిల్లా నుంచి భారీ ఊరేగింపుతో..

14 గ్రామ దేవతల గుడులకు సంబంధించిన ఊరేగింపు ఆదివారం ఖిల్లా శారదాంబ గద్దె నుంచి మొదలవుతుంది. పెద్దబజార్ చౌరస్తా, దుబ్బ, వినాయక్‌నగర్, సిర్నాపల్లి గడి నాలుగు విభాగాలుగా ఊరేగింపుగా కొనసాగి ఆయా దేవతామూర్తులను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేస్తారు. గాజుల్‌పేటలోని వివేకానంద చౌరస్తా వద్ద భారీ పోలీసు బందోబస్తు మధ్య సరి (ఇంటిపైన, పొలాల్లో చల్లుకునే పదార్థం) చల్లుతారు. తెల్లవారుజాము 2గంటల నుంచే కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. తొమ్మిది గంటలకు ఖిల్లా నుంచి ఊరేగింపు మొదలవుతుంది. ఊర పండుగ ఊరేగింపు వెళ్లే వరకు నగరవాసులు స్నానాలు ఆచరించకుండా, ఇండ్లు సైతం శుభ్రం చేసుకోరు. ఊరేగింపు అనంతరం ఇంట్లోని పాత సామగ్రిని పారేసి ఇండ్లను శుభ్రం చేస్తారు. ఆ తర్వాత స్నానాలు ఆచరిస్తారు.


గ్రామదేవతల విగ్రహాల వద్ద వతాన్‌దార్లు

### వాహనాల దారి మళ్లింపు..

వినాయక్‌నగర్, జూలై 27: ఊర పండుగను పురస్కరించుకొని నిజామాబాద్ నగరంలో వాహనాల దారిమళ్లింపు చేపడుతున్నట్లు సీపీ కల్మేశ్వర్ సింగేనవార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఖిల్లా చౌరస్తా నుంచి సిర్నాపల్లి గడి(గోల్‌హనుమాన్), వినాయక్‌నగర్, దుబ్బా(జీజీ కాలేజ్)వరకు ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందని పేర్కొన్నారు. బోధన్ నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు అర్సపల్లి, కొత్త కలెక్టరేట్, జీజీ కాలేజీ, రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి మీదుగా బస్టాండ్‌కు చేరుకోవాలని సూచించారు. భారీ వాహనాలు కొత్త కలెక్టరేట్ బైపాస్ మీదుగా మాధవనగర్ వెళ్లాల్సి ఉంటుంది. నిజామాబాద్ బస్టాండ్ నుంచి బోధన్ వెళ్లే ఆర్టీసీ బస్సులు రైల్వేస్టేషన్, తిలక్‌గార్డెన్ చౌరస్తా మీదుగా గాంధీచౌక్, నెహ్రూపార్క్, బోధన్ బస్టాండ్ మీదుగా వెళ్లాలి. హైదరాబాద్ నుంచి బోధన్ వెళ్లే వాహనాలు మాధవనగర్ బైపాస్ నుంచి కొత్త కలెక్టరేట్, అర్సపల్లి మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. ఖిల్లా చౌరస్తా నుంచి సిర్నాపల్లి గడి(గోల్‌హనుమాన్)మార్గంలో వెళ్లేవారు ప్రత్యామ్నాయ మార్గాల నుంచి వెళ్లాలని కోరారు.

### గ్రామదేవతలు ఇవే..

సార్గమ్మ–1,2: బాలికల ఉన్నత పాఠశాల, కొండలరాయుడు
బోగంసాని: సిర్నాపల్లి గడి
మహాలక్ష్మి అమ్మవారు
అంపుడు పోశమ్మ
అసు, రాట్నం: మహాలక్ష్మీనగర్
ఐదు చేతుల పోచమ్మ: వినాయక్‌నగర్
మత్తడి పోచమ్మ: హనుమాన్ జంక్షన్
పాడలమ్మ: హమాల్‌వాడి
పెద్దమ్మతల్లి
అడెల్లిపోచమ్మ : దుబ్బ



### పండుగ ఇలా మొదలైంది..

ఏడు దశాబ్దాల క్రితం ప్లేగు వ్యాధి ప్రబలిన సమయంలో పండితులు గ్రామదేవతలను పూజించాలని సూచించారు. అప్పటి నుంచి ఆషాఢమాసంలో పౌర్ణమి తర్వాత ఊరపండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. పెద్ద పండుగ జరుపుకోవడంతో పాడి పంటలు సమృద్ధిగా పండడం, వర్షాలు సకాలంలో కురవడంతో నగరవాసులందరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నారు. ఇలా 76 ఏండ్ల నుంచి అన్ని కులాలు ఐక్యతతో ఊరపండుగను జరుపుకొంటున్నాయి.

### ఏర్పాట్లు పూర్తి ..

గ్రామ సేవకులు ఆదివారం తెల్లవారుజామున 3గంటలకు గ్రామదేవతల విగ్రహాలకు వెండితో తయారుచేసిన కండ్లు అలంకరిస్తారు. అనంతరం తేలు మైసమ్మ గద్దె దగ్గరికి తీసుకెళ్తారు. వడ్లదాతి నుంచి గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేసి గ్రామసేవకులు ఖిల్లా గద్దెకు చేరుస్తారు. తొట్టెలను ఒకరోజు ముందు రాత్రి 11నుంచి ఉదయం 3గంటల వరకు హమాలీ సంఘం ఆధ్వర్యంలో పాతగంజ్‌లో తయారుచేసి, ఉదయం 5గంటల వరకు తేలు మైసమ్మ గద్దె వద్ద ఉంచుతారు. ఊరేగింపులో మొదట తొట్టెలు ఊరేగుతాయి.



## మేకల సంత@ రూ. 4కోట్లు

నవీపేట, జూలై 27: మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన మేకల సంతలో రికార్డు స్థాయిలో క్రయవిక్రయాలు జరిగాయి. ఒక్కరోజే రూ. 4 కోట్ల జీవాల క్రయ విక్రయాలు జరిగినట్లు పంచాయతీ అధికారులు తెలిపారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించనున్న ఊర పండుగతోపాటు ఆషాఢమాసంలో చివరి ఆదివారం కావడంతో జీవాలకు డిమాండ్ పెరిగింది. ఒక్కో పెద్ద మేక ఖరీదు రూ. 12 వేల నుంచి రూ. 15వేల వరకు పలుకగా.. చిన్నవి రూ. 10 వేలకు తగ్గకుండా పలికినట్లు వ్యాపార వర్గాలు పేర్కొన్నాయి.

### సంప్రదాయ వేడుక



సుదీర్ఘ సంవత్సరాలుగా ఊరపండుగను 38 కుల సంఘాలతో నిర్వహిస్తున్నాం. నగర ప్రజల్లో ఐకమత్యం, భక్తిభావాలు పెంపొందుతున్నాయి. రాజకీయాలకు అతీతంగా ఈ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలి.

**-యెండల లక్ష్మీనారాయణ, అధ్యక్షుడు, సర్వసమాజ్**

### బోనాలు, సరి ప్రత్యేకం



ఊరపండుగ నేపథ్యంలో బోనాలు తీయడం సంప్రదాయంగా వస్తున్నది. గ్రామదేవతలను భక్తిశ్రద్ధలతో పూజించడంతోపాటు సరి పదార్థాన్ని అందరిపై చల్లడం ఆనవాయితీగా కొనసాగుతున్నది. దీంతో గ్రామదేవత అనుగ్రహంతో పాడిపంటలు సమృద్ధిగా పండుతాయని రైతన్నల విశ్వాసం.

**- రాంబర్తి గంగాధర్, కన్వీనర్**